

కరెన్సీ కనకదుర్గ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గొబ్బూరులో కనకదుర్గమ్మను మంగళవారం రూ.1.60 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త మునగపాక సోమరాజు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

–న్యూస్‌టుడే, కశింకోట

స్కేటింగ్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పతకాలతో చిన్నారులు, కోచ్ మణికంఠ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో నర్సీపట్నంకు చెందిన పలువురు చిన్నారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం నుంచి 16 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో ఏడు నుంచి పదకొండు ఏళ్లలోపు వయసున్న ఎనిమిది మంది విజేతలుగా నిలిచారు. రోడ్డు, రింక్ విభాగాల్లో పసిడి, రజతం, కాంస్య పతకాలు పదహారు సాధించారు. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నర్సీపట్నం అధ్యక్షుడు వెలగా నారాయణరావు, కోచ్ మణకంఠ మంగళవారం విజేతలను అభినందించారు.

★ ఆశపెట్టి.. భయపెట్టి.. మోసాలు ★ చదువుకున్న వారికీ టోకరా

సైబర్ వల.. ఖాతా గుల్ల



ఉద్యోగం అంటూ ఆశపెడతారు.. వ్యాపారంలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు అంటూ ఎరవేస్తారు.. తాము పోలీసులమంటూ బెదిరిస్తారు.. తియ్యటి మాటలతో యువతులు ట్రాప్ చేస్తారు. ఇలా ఎన్నో రకాలు సైబర్ మోసాలు అధికమవుతున్నాయి. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని లక్షలాది రూపాయలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు.

ఈనాడు, అనకాపల్లి
-న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

పోలీస్‌స్టేషన్లకు ఇది వరకు ఇళ్ల దొంగతనాలు, కొట్లాట, అత్యాచారం, హత్యాయత్నం కేసులు వచ్చేవి. ఇప్పుడు ఇవి తగ్గి సైబర్ నేరాల కేసులు అధికమయ్యాయి. అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సెప్టెంబరులో 7 సైబర్ నేరాల కేసుల వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చాలా మంది సైబర్ నేరగాళ్ల మాటల వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నా ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడంలేదు.

సైబర్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఫిర్యాదులను పరిష్కరించడానికి జిల్లాకో సైబర్‌స్టేషన్ పెట్టాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేసింది.

ఒక పోలీస్ ఉన్నతాధికారి మాట్లాడుతూ జిల్లాకొకటి కాదు. డివిజన్‌కొక స్టేషన్ పెడితేనే గానీ కేసులు పరిష్కారం కాదని చెప్పారంటే ప్రస్తుతం భవిష్యత్‌లో సైబర్ నేరాలు ఎలా ఉంటాయోనన్న భయాందోళనలు అందరిలోనూ నెలకొంటున్నాయి.

సెప్టెంబరు 5న

▸▸ తుమ్మపాలకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి సైబర్ మోసానికి గురైనట్లు అనకాపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వాట్సాప్‌లో ఇతని నంబరు యాడ్‌చేసి గ్రూపులోని సభ్యులందరూ వ్యాపారం చేస్తున్నారని లాభాలు వచ్చాయని నమ్మించి రూ. 8.45 లక్షలు నగదు కాజేశారు.

సెప్టెంబరు 6న

▸▸ అనకాపల్లి గాంధీనగరానికి చెందిన వివాహితకు గూగుల్‌లో హోటల్స్ రేటింగ్స్ ఇవ్వడం ద్వారా నగదు సంపాదించొచ్చని ఆశ చూపారు. తొలుత రూ. 100 పంపితే తిరిగి రూ. 150 పంపారు. అలా నమ్మించి వివాహిత నుంచి రూ. 1.26 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు.

సెప్టెంబరు 10న

▸▸ అనకాపల్లికి చెందిన యువకుడి పేరుమీద మాదక ద్రవ్యాలు పార్సిల్ వచ్చిందని సైబర్ నేరగాళ్లు పోలీసుల పేరుతో యువకుడికి ఫోన్ చేశారు. తమ విచారణలో మాదకద్రవ్యాలతో సంబంధిత యువకుడి ప్రమేయం ఉందని బెదిరించడంతో అతడు రూ.లక్ష పంపాడు. తర్వాత తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

సెప్టెంబరు 12న

▸▸ తుమ్మపాలకు చెందిన యువకుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఇంటి వద్దనే ఉంటూ డబ్బులు సంపాదించొచ్చని, తాము పంపిన లింక్‌ను ఓపెన్ చేయాలని చెప్పడంతో దాన్ని ఓపెన్‌చేసి లావాదేవీలు చేశాడు. అలా చేస్తూ రూ. 5.68 లక్షలు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు.

సెప్టెంబరు 14న

▸▸ నమోదైన కేసులో అనకాపల్లికి చెందిన యువకుడు అమెజాన్‌లో ఉద్యోగం కోసం ఆన్‌లైన్ పరీక్ష రాశాడు. ఇతనికి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి ఉద్యోగంలో జాయిన్ కావాలంటే తాము పంపిన లింక్ ఓపెన్ చేయాలని చెప్పారు. అలా ఓపెన్ చేశాడు. యువకుడు బ్యాంకు ఖాతా నుంచి రూ. 1.85 లక్షలు కాజేశారు.



అనకాపల్లిలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సెప్టెంబరు 15న

▸▸ బ్యాంకు ఉద్యోగి నుంచి అధిక లాభాల వ్యాపారం పేరుతో వాట్సాప్ గ్రూపులోని సభ్యులుతో కలసి పెట్టుబడి పెట్టించినట్లుగా నమ్మించి రూ. 15.29 లక్షలు కాజేశారు. దంత వైద్యుడిని ఆర్మీ ఉద్యోగులకు వైద్యం అందించే పేరుతో, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దిల్లీ సైబర్ క్రైం పోలీసుల పేరుతో బెదిరించి డబ్బులు కాజేశారు.

ఇలా అనకాపల్లిలో గత నెలలో ఏడు కేసులు. ఈ నెలలో ఒకటి సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి.



పోలీసులు బెదిరించరు..



సైబర్‌నేరగాళ్లు సులభంగా డబ్బులు వస్తాయని ఆశ చూపుతారు. ఇంటి వద్దనే ఉంటూ డబ్బులు సంపాదించొచ్చని నమ్మించడానికి కొంతనగదు లావాదేవీలు చేస్తారు. వీటికి మోసపోయి నగదు పోగొట్టుకుంటున్న కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. ఉద్యోగాల పేరుతో యువతకు ఫోన్‌చేస్తే నమ్మొద్దు. పోలీసులు ఎవరూ మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం.. మీపై కేసులు ఉన్నాయని ఫోన్లు చేయరు. ఏదైనా అనుమానం ఉంటే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి వారికి వచ్చిన ఫోన్ నంబరు చూపించి వివరాలు తెలుసుకోవచ్చు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడి మాటలకు మోసపోయి నగదు పోగొట్టుకోవద్దు.

– విజయ్‌కుమార్, అనకాపల్లి పట్టణ సీఐ

ఆయిల్‌పామ్ రైతులకు మంచిరోజులు

టన్నుకు రూ.3 వేలు పెరిగిన ధర



రోలుగుంట, న్యూస్‌టుడే: మార్కెట్‌లో వంట నూనెల ధరలు గణనీయంగా పెరగడంతో ఆయిల్‌పామ్ గెలలకు గిరాకీ ఏర్పడింది. టన్నుకు రూ.3 వేల వరకు ధర పెరగడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు వరకు టన్ను ధర రూ. 13,950 ఉండగా ప్రస్తుతం రూ. 16,930 పలుకుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని పద్మనాభం, భీమునిపట్నం, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల, చోడవరం, నర్సీపట్నం, కె.కోటపాడు, రోలుగుంట, రావికమతం, నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం, ఎలమంచిలి, కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో సుమారు 500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతోంది. రైతుల నుంచి ఆయిల్‌పామ్ గెలలను కంపెనీలే కొనుగోలు చేసి 15 రోజుల్లోగా బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తుంటాయి. భవిష్యత్తులో ధర మరింత పెరిగే ఆస్కారముందని రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

ఆమె వచ్చారు.. కానీ..!

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్త డీపీవో శాంతామణి చేరికలో జాప్యం చోటుచేసుకుంది. ఈనెల 22న జరిగిన బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లాకు డీపీఓగా శాంతామణిని నియమించారు. ఈమె కొవ్వూరులో డీఎల్‌డీవోగా విధులు నిర్వహించేవారు. ఈ నెల 5న అక్కడ కొత్త డీఎల్‌డీవో వచ్చి చేరడంతో రిలీవ్ అయ్యారు. సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి విధుల్లో చేరడానికి జాయినింగ్ ఆర్డర్ అందించారు. అయితే రెండు వారాలు ఆగాలని ఆమెకు కలెక్టర్ చెప్పారు. ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుంచి శాంతామణి జాయినింగ్ ఆర్డర్‌ను రెండు వారాలు నిలుపుదల చేయాలని ఆదేశాలు రావడంతో కలెక్టర్ ఆమేరకు ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.







రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు చినదొడ్డిగల్లు విద్యార్థులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: చినదొడ్డిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి. దుర్గాప్రసాద్, బి.సువర్ణరాజు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని కవిత తెలిపారు. వారు ఉమ్మడి జిల్లా అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పీడీ ఆదిలక్ష్మి, ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.వి. రమణ అభినందించారు.



విద్యార్థులతో హెచ్‌ఎం కవిత, పీడీ

తాగునీటి ఎద్దడి.. మహిళల ఆందోళన



ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన

చీడికాడ, న్యూస్‌టుడే: కోనాం పంచాయతీ కొడ్లకొత్తూరు గ్రామానికి ఆరు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు, మండల కార్యదర్శి దేముడునాయుడుతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. చినకోనాం నుంచి నీటిని సరఫరా చేసే వారని, గ్రామంలో కొత్తగా ట్యాంకు నిర్మాణంతో ఆరు నెలలుగా సరఫరాను నిలిపివేశారని చెప్పారు. ప్రస్తుతం కిలోమీటరు దూరంలోని గెడ్డ నుంచి నీటిని తెచ్చుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు.





రుణాల తిరిగి చెల్లింపులో అశ్రద్ధ తగదు

మాకవరపాలెం, నక్కపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ పథకాల కింద రుణాలు తీసుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జాతీయ పర్యవేక్షణ కమిటీ సభ్యుడు అనిల్ గైక్వాడ్ అన్నారు. మాకవరపాలెం మండలం రామన్నపాలెం, నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామాలను కమిటీ సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోకర్ మంగళవారం సందర్శించారు. రామన్నపాలెంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. పేద కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించడంలో అశ్రద్ధ చూపించవద్దని కోరారు. ఉపాధి హామీలో తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యాన పంటలు పండించే తోటల దగ్గరకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. డ్వాక్రా సంఘాలు, ఉపాధి హామీ పథకంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, ఏపీడీ జై, ఎంపీడీవోలు సీతారామరాజు, సీతామహాలక్ష్మి, ఏపీఎం డీపీఎం, వర్లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామన్నపాలెం గ్రామసభలో రికార్డులు పరిశీలిస్తున్న అనిల్ గైక్వాడ్

అతివలూ.. అందిపుచ్చుకోండి

కస్తూర్బాల్లో ఉద్యోగాల దరఖాస్తుకు రేపు ఆఖరు

నక్కపల్లి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా కస్తూర్బా విద్యాలయాల్లో మహిళా బోధకులు, సహాయకులు తదితర ఖాళీల భర్తీపై దృష్టి సారించింది. ఈ క్రమంలో దరఖాస్తులకు ఇచ్చిన గడువు ఈనెల 10తో ముగియనుంది.

కస్తూర్బా విద్యాలయాల్లో ఆరు నుంచి పది తరగతి వరకు బోధించడానికి సీఆర్‌టీలు, ఇంటర్ పీజీటీలు, పీఈటీలు అదేవిధంగా పార్ట్‌టైం టీచర్లు, బోధనేతర సిబ్బంది ఉంటారు. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీనికనుగుణంగా కార్యాచరణ చేపట్టిన ఉన్నతాధికారులు ఒప్పంద, పొరుగుసేవల విధానంలో ఏడాది ప్రాతిపదికన ఖాళీల భర్తీ కోరుతూ ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రిన్సిపల్, పీజీటీలు, సీఆర్టీలు, కంప్యూటర్, ఒకేషనల్, అకౌంటెంట్, వార్డెన్లు కలిపి 604 ఖాళీలను ప్రకటించారు. ఇందులో కొన్ని జిల్లాల్లో కొన్నిరకాల ఖాళీలు మాత్రమే ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలో 24 కస్తూర్బా విద్యాలయాల్లో కలిపి 29 పోస్టులు ఒప్పంద, పొరుగు సేవల పోర్టింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఇందులో పోస్టును బట్టి కనీసం రూ.18వేల నుంచి గరిష్ఠంగా రూ. 34 వేలకు పైగా వరకు వేతనం ఇస్తారు. ఇందుకోసం అర్హత కలిగిన వారంతా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. గతనెల 26 నుంచి వెబ్‌సైట్ apkgbv.apcsff.in అందుబాటులోకి వచ్చింది. ఈనెల 10తో వీటికి గడువు ముగియనుంది. వెబ్‌సైట్లోకి వెళితే విద్యార్హతలు, వయసు గడువు తదితర వివరాలు ఇందులోనే కనిపిస్తాయి. కాగా జిల్లాలో ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురానున్న టైప్ 4 కేజీబీవీల్లో వార్డెన్ నియామకానికి చర్యలు చేపట్టారు. జిల్లాలో నాలుగు వార్డెన్ పోస్టులు నూతనంగా భర్తీ చేస్తున్నారు.



కేజీబీవీ పాఠశాల



విద్యార్థినులకు బోధన చేస్తున్న పీజీటీ

జిల్లాలో ఖాళీలు ఇలా..

బోధన	
సీఆర్టీలు	8
పీజీటీలు	7
పార్ట్‌టైం టీచర్స్	7
బోధనేతర	
వార్డెన్లు	4
అకౌంటెంట్	3

ప్రతిభ ఆధారంగానే

జిల్లాలో ఉన్న ఖాళీ వివరాలు, దరఖాస్తుకు అర్హతల తదితర వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయి. ఇవి కేవలం మహిళలకు మాత్రమే. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో గడువులోగా సమర్పించాలి. కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ ఉంటుంది. ప్రమాణాలు పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈనెల 23 లోగా ప్రక్రియ పూర్తవుతుంది. 24న విధుల్లో చేరాల్సి ఉంటుంది.



- ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈఓ

వేతనాల నిలిపివేతపై విచారణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సబ్బవరం, కె.కోటపాడు మండలాల్లో 16 మంది వీవోఏల వేతనాలు నిలిపివేయడంపై డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ శచీదేవి మంగళవారం విచారణ చేపట్టారు. ఏపీఎంలు సాయి రమేశ్, వెంకటలక్ష్మి జీతాల నిలుపుదలపై వివరణ కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీసీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా నిలుపుదల చేసినట్లు సబ్బవరం ఏపీఎం సాయి రమేశ్ పేర్కొన్నారు. కె.కోటపాడు ఏపీఎం సరైన కారణాలు చెప్పలేకపోయారు. పీడీ అందరి వివరాలను రికార్డు చేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో పేట విద్యార్థులకు స్వర్ణం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జాతీయస్థాయి యోగా పోటీల్లో పాయకరావుపేట విద్యార్థులు బంగారుపతకాలు సాధించారు. ఈనెల 2 నుంచి 5 వరకు గుజరాత్ ప్రాంతంలోని సూరత్‌లో సీబీఎస్‌ఈ బోర్డు ఆధ్వర్యంలో బృంద యోగా పోటీలు నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో జి.ఎస్.ఎస్. చరణ్, పి.సోహన్‌కృష్ణ, బి.దేవాన్ష్‌నాయుడు, సీహెచ్.జయదీప్, వి.చైతన్య బృందం పలు ఆసనాలతో సత్తా చాటారు. ఉంటి ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకాలు సొంతం చేసుకున్నారు. విజేతలను సంస్థ అధినేత సీహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, యోగా గురువులు డి.సురేష్, జయంతి తదితరులు అభినందించారు.



పతకం సాధించిన విద్యార్థులతో శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు



జాతీయ స్థాయి యోగా పోటీలకు లయవర్ధన్

చోడవరం, న్యూస్‌టుడే: అసోంలో నవంబరులో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు చోడవరం పట్టణానికి చెందిన గొంతిన లయవర్ధన్ ఎంపికయ్యాడు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారని పతంజలి యోగా శిక్షణ కేంద్రం వ్యవస్థాపకుడు సతీష్ చెప్పారు. లయవర్ధన్‌ను ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ రమణాజీ, యోగా శిక్షకుడు గణేష్, హరికిరణ్ మంగళవారం అభినందించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు : కలెక్టర్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, జలవనరుల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నియమ, నిబంధనలను పాటించాలన్నారు. సాగునీటి సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. దీనికి ముందు జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

14 నుంచి పల్లె పండగ

జిల్లాలో ఈనెల 14 నుంచి 645 పంచాయతీల్లో పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 214 కోట్లు పనులు గుర్తించామని, 103 కోట్లు పనులకు ఆమోదం తెలిపామన్నారు. ఈనెల 20 వరకు వారోత్సవాలు పక్కాగా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. చేపట్టిన పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నారు. భూగర్భ జలాలు పెంచడానికి చెక్ డ్యాంలు, కుంటల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీఓ శిరీషారాణి, అధికారులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా అధికారులు

అరకులోయలో 'ఎన్‌సీసీ' ట్రెక్కింగ్

విశాఖపట్నం, అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి మొత్తం 450 మంది నేషనల్ క్యాడెట్ కార్ప్స్ మంగళవారం అరకులోయ ట్రెక్కింగ్ నిర్వహించారు. ఆంధ్ర డైరెక్టరేట్ బాలికల విభాగం కమాండింగ్ అధికారి గోపాల్ సారథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి 25 మంది ఆర్మీ అధికారులు హాజరయ్యారు. శిబిరంలో భాగంగా క్యాడెట్లు రణజిల్లెడ జలపాతాన్ని సందర్శించారు. ఏపీ-తెలంగాణ డిప్యూటీ డైరెక్టరేట్ జనరల్ బీఎం.రెడ్డి సాహస యాత్రలో పాల్గొన్నారు. శిబిరాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.జమాల్‌బాషా తదితరులు సందర్శించారు. అరకులోయలో సాగించిన ట్రెక్కింగ్ ఎంతో అనుభూతి ఇచ్చిందని క్యాడెట్లు సంతోషం వ్యక్తం చేశారు.



మ్యాప్ పరిశీలిస్తున్న ఎన్‌సీసీ అధికారులు



హాజరైన విద్యార్థులు

ఊరంతా ఈగల మోత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దోసూరులో బాధలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పగలూ రాత్రి తేడా లేకుండా ఈగల గుంపులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ గ్రామాన్ని ఆనుకొని కోళ్లఫారాలు ఎక్కువగా ఉండడంతో ఈగలు పెరిగిపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయే సమయాల్లో ఇంట్లో ఉండలేకపోతున్నామని చెబుతున్నారు. ఈగల వల్ల ఆహారం కలుషితం కావడం, అతిసారం, టైఫాయిడ్‌తో ప్రజలు మంచాన పడుతున్నారు. ఈగలు ఇంతలా ఇబ్బంది పెడుతున్నా పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. కోళ్లఫారాల ఏర్పాటుకు నచ్చినట్లు అనుమతులు అందిస్తున్న అధికారులు ఈగలు పెరిగిపోయినా వాటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని జనాలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వీటి నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు కోళ్లఫారాలను గ్రామాలకు దూరంగా తరలించాలని కోరుతున్నారు.



ఓ ఇంటి వరండాలో ఈగలు

ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల

ఓ కన్సల్టెన్సీ గుట్టురట్టు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రైవేటు జాబ్ మేళా పేరుతో ఎస్కేఎం ప్లేస్‌మెంట్స్ అండ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఓ కన్సల్టెన్సీ సంస్థ ఎటువంటి కంపెనీలతో ఒప్పందం లేకుండానే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలతో మోసం చేయడానికి ప్రయత్నించింది. విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం, పార్వతీపురం గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులను ఉద్యోగం వచ్చిందని నమ్మించి ధ్రువపత్రాలు తీసుకుని నగదు కాజేసే ప్రయత్నం చేసింది. మంగళవారం ఉదయం విశాఖలోని దొండపర్తి ప్రాంతానికి వచ్చిన ఆయా ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గురించి తెలుసుకున్న ఎ.పి. నిరుద్యోగ జే.ఎ.సి. రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ స్వయంగా వెళ్లి నిర్వాహకులతో మాట్లాడారు. ఉద్యోగాలకు సంబంధించి ఎటువంటి హామీ లేదని, అంతా ఉత్తుత్తిదేనని తెలుసుకుని నిరుద్యోగులకు తెలిపి మోసపోకుండా నిలువరించారు. నిరుద్యోగులకు వారి ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి జాబ్ మేళాకు ఒక తహసీల్దారును మేళాకు పర్యవేక్షణాధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నానని తెలిపారు.



విద్యార్థులకు పత్రాలను అందజేస్తున్న ఎ.పి. విద్యార్థి నాయకుడు సమయం హేమంత్‌కుమార్

స్కూటీపై గంజాయి రవాణా

పోలీసులకు పట్టుబడిన యువతీయువకులు

చీడికాడ, న్యూస్‌టుడే: గంజాయి మత్తుకు అలవాటు పడిన ముగ్గురు యువతీయువకులు విక్రయించడమూ మొదలుపెట్టారు. కొన్నాళ్లుగా మన్యం నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నారు. చీడికాడ మండలం మీదుగా స్కూటీపై గంజాయి తరలిస్తూ మంగళవారం పోలీసులకు చిక్కారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో వరహాపురం కూడలిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. స్కూటీపై వస్తున్న ముగ్గుర్ని ఆపి తనిఖీ చేయగా.. రూ.75 వేల విలువైన 15 కేజీల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన ముగ్గురు చోడవరం గోవిందమ్మ కాలనీకి చెందిన సకిలేటి దుర్గాప్రసాద్, సిటిజన్ కాలనీకి చెందిన జయవరపు కిరణ్‌సాయి, కోటవీధికి చెందిన మళ్ల కీర్తిగా పోలీసులు గుర్తించారు. గంజాయితోపాటు స్కూటీ, సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితులను చోడవరం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు. వీరికి గంజాయి విక్రయించిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.



గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులతో పోలీసులు

ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై తనిఖీలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం, జె.వి.పాలెంలో మంగళవారం గనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంగారమ్మపాలెంలో సముద్ర ఇసుక, జె.వి.పాలెంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. దీనిపై మైన్స్ ఏజీ వెంకటరమణ, ఆర్.ఐ. సత్యమూర్తి సిబ్బందితో కలిసి రెండు గ్రామాల్లో సముద్ర ఇసుక, గ్రావెల్ తవ్వేసిన ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. తవ్వకాలు ఎప్పుడు జరుగుతున్నాయి, ఎవరు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని ఆర్ఐ సత్యమూర్తి తెలిపారు.



బంగారమ్మపాలెంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యుదాఘాతానికి భవాని భక్తుడి మృతి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బవులవాడలో సోమవారం రాత్రి భవానీమాత పూజలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి గ్రామీణ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. గొలగాం గ్రామానికి చెందిన రోమాల సాయి, ఇతని తల్లి నాగలక్ష్మి భవాని మాల వేశారు. బవులవాడలోని రాత్రి జరిగిన పూజకు వీరు వెళ్లారు. ఇక్కడ ఏర్పాటు చేసిన లైటింగ్ స్తంభానికి సాయి (19) ఆనుకుని కూర్చున్నాడు. ఈ సమయంలో విద్యుదాఘాతానికి గురికావడంతో అర్ధరాత్రి అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి నాగలక్ష్మి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. నాగలక్ష్మికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు సాయి తల్లి కళ్ల ముందే మృతి చెందడంతో ఈమె రోదిస్తున్న తీరు పలువురికి కలచివేసింది.



సాయి (పాత చిత్రం)

భార్య నిలదీసిందని తాపీమేస్త్రి ఆత్మహత్య

రావికమతం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన తాపీమేస్త్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రావికమతం ఎస్సై రఘువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మేడివాడకు చెందిన గంటా కృష్ణ (36)కు పదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన దేవితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే భర్త తాగుడుకు బానిసగా మారడంతో సోమవారం మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సమయంలో భార్య నిలదీసింది. కోపంతో కృష్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. వీరు నివాసం ఉండే ఇంటి పక్కన కోన సత్తిబాబుకు చెందిన పాత పెంకుటిల్లు ఉంది. దాన్ని తొలగించి కొత్తగా ఇల్లు కట్టుకోవాలని సత్తిబాబు ఆ పక్కనే మరో ఇంట్లో ఉంటున్నాడు. మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన కృష్ణ రాత్రి సమయంలో సత్తిబాబుకు చెందిన పెంకుటింట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం సత్తిబాబు భార్య లక్ష్మి పాత ఇంట్లో దూలానికి వేలాడుతున్న కృష్ణను చూసి భయంతో కేకలు వేశారు. చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రఘువర్మ సిబ్బందితో అక్కడకు చేరుకుని సర్పంచి లీలాశివ, కృష్ణ భార్య, తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ.. ముగ్గురికి గాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నక్కపల్లి వద్ద లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కాకినాడ నుంచి విశాఖపట్నంకు సుమారు 30 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వెళ్తోంది. నక్కపల్లి వీవర్స్ కాలనీ వద్ద రోడ్డుపై గేదె అడ్డు రావడంతో లారీ డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ కనకేశ్వరరావు, ప్రయాణికులు పద్మ, నాగలక్ష్మి గాయపడగా, స్థానికుల సాయంతో పోలీసులు వీరిని నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మిగిలిన ప్రయాణికులు వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు వెళ్లారు.



దెబ్బతిన్న బస్సు ముందు భాగం

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **దేవర** పర్తిసాయి: **కలి** సత్యనారాయణ స్క్రీన్-1: **రామ్‌నగర్ బన్నీ** స్క్రీన్-2: **మత్తు వదలరా-2** వెంకటేశ్వర: **దక్షిణ** శ్రీ సత్య: **జెంటిల్‌మేన్** రామచంద్ర: **శ్వాగ్** షిర్డిసాయి: **సత్యం సుందరం** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **శ్వాగ్** స్క్రీన్-2: **దేవర**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు కారణంగా మంగళవారం మిలట్రీకాలనీ, కొత్త పేట, గుంటూరివారి వీధి, యాతపేటలో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ కె.రాజశేఖర్ చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరా నిలిపివేస్తున్నామ న్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమ నించాలని కోరారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

ఆశ్రమ పాఠశాలల సందర్శన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల, అచ్యుతాపురం గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలలను ఎలమంచిలి సివిల్ జడ్జి విజయ మంగళ వారం సందర్శించారు. కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్‌లో అనాథ చిన్నారులు, నిర్వాహకులతో మాట్లాడారు. మండ లకేంద్రంలో దివ్యాంగ ఆశ్రమ పాఠశాల, బ్లైండ్ ఛారిటబుల్ ట్రస్టు లను సందర్శించి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. న్యాయవాదులు హరి శంకరరావు, నూకరాజు, లోక్ అదాలత్ సభ్యులు పీవీ రమణ, పట్నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగ బాలుడిని చూస్తున్న సివిల్ జడ్జి విజయ

ఆవాసానికి మళ్లీ అవకాశం

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కొత్త వారికే కాకుండా తెదేపా హయాంలో ఇళ్లు నిర్మించుకుని వివిధ స్థాయిల్లో బిల్లులు సగంలో ఆగిన వారికి తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రస్తుతం ఇంటింటి సర్వే చేస్తున్నారు. దీంతో అప్పటి లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

2014-19 మధ్య తెదేపా హయాంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేశారు. 2008 పల్స్ సర్వేను అను సరించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేసి, రూ. 2 లక్షల చొప్పున ఇంటి నిర్మాణ దశలకనుగుణంగా చెల్లిం పులు జరపగా, ఎన్టీఆర్ గృహనిర్మా ణంలో రూ. 1.5 లక్షలు కేటాయించారు. కాగా అప్పటి ప్రభుత్వం పాలన ముగిసే సమయానికి మండలాల్లో వందల మంది లబ్ధిదారులకు వివిధ స్థాయిల్లో బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కాగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కార్ ఇలాంటి వారిని విస్మరించింది. తమ హయాంలో ఇళ్లు కాదు, ఊళ్లే కడతామంటూ గొప్పలు పోయి అయిదేళ్ల కాలంలో దాన్ని అటకెక్కించింది. తాజాగా అధి కారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చే చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గృహనిర్మాణ పథకంలో మార్పులు చేస్తూ, లబ్ధిదారులకు అందించే నిర్మాణ సాయం భారీగా పెంచింది. మరోవైపు తమ హయాంలోని అసంపూర్తి బిల్లుల చెల్లింపులపైనా దృష్టి పెట్టింది. ఈ క్రమంలో సంబంధిత అధికారులతో సర్వే మొదలు పెట్టించింది. చెల్లిం పులు పూర్తికాని ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి సర్వే చేయాలని ఆదేశించింది. ఇందు కోసం ప్రత్యేకంగా 'ఏపీఎస్‌హెచ్‌సీ ఎల్' పేరిట యాప్ రూపొందిం చింది. దీని ద్వారా సర్వే చేసి వివ రాలను ఆన్‌లైన్ చేసే పనిలో అధి కారులు పడ్డారు. ఆ మేరకు పాయ కరావుపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో ఈ ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నారు. ఇక్కడ సుమారు 3500 ఇళ్లకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం గృహ నిర్మాణ సంస్థ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో తిరుగుతున్నారు. ఇల్లు పూర్తయ్యిందా? అదే పరిస్థితిలో ఉందా? పూర్తయిన ఇంట్లో లబ్ధిదారులే ఉంటున్నారా? వేరెవరైనా ఉన్నారా? తొలి బిల్లు పొంది, పునాది స్థాయిలోనే నిలిచినవి ఏమైనా ఉన్నాయా? ఉంటే వారికి ఇప్పుడు పథకం మంజూరు చేస్తే, కట్టుకోడానికి సిద్ధమా? ఇలాంటి వివరాలను యాప్‌లో నమోదు చేస్తు న్నారు. తుది నివేదిక పరిశీలన తర్వాత ప్రభుత్వం మార్గద ర్శకాలు జారీ చేయనున్నట్లు సమాచారం.



ఇంటింటి సర్వే చేస్తున్న ఉద్యోగులు

మండలం	అసంపూర్తి ఇళ్ల సంఖ్య
నక్కపల్లి	922
పాయకరావుపేట	919
ఎస్.రాయవరం	856
కోటవురట్ల	785

త్వరలోనే పూర్తి



తెదేపా హయాంలో నిర్మించిన ఇళ్లలో కొన్ని బిల్లులు పూర్తిగా చెల్లిం చలేదు. దీంతో వీటిపై సర్వే చేసి నివే దిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదే శించింది. ఇలా సర్వేలో అర్హత పొందిన వాటికి బిల్లులు చెల్లించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నాం. ఇప్పటికే పదిరో జులుగా సర్వే చేస్తున్నాం. త్వరితంగా పూర్తిచేసి త్వరలోనే నివేదిస్తాం.

– పి.విజయుడు, డీఈ

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు



తలపడుతున్న ఆటగాళ్లు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఫుట్‌బాల్ టోర్న మెంట్ మంగళవారం ప్రారంభమైంది. దసరా సందర్భంగా రాట్నాలపాలెం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. దీనిలో లయన్స్, క్రేజీ, స్ట్రైకర్స్, స్పోర్ట్స్ బృందాలు తలపడుతున్నాయి. ఈనెల 10 వరకు టోర్న మెంట్ జరుగుతుంది.

బంగారు ఆభరణాలు కాజేసిన నిందితుల అరెస్ట్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మహిళను కత్తితో బెదిరించి 9 తులాల బంగారు ఆభరణాలను కాజేసిన నింది తులను అనకాపల్లి పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన తిరిగారి గోవిందమ్మ ఈనెల 5న ఆటోలో వస్తుండగా పూడిమడక రోడ్డు వద్ద ఇదే ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు కత్తితో బెదిరించి మహిళ మెడలో తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను కాజేశారు. బాధితు రాలి ఫిర్యాదు మేరకు కె.కోటపాడు మండలం కొట్టాం గ్రామానికి చెందిన రావుల ఎల్లారమ్మ, కొత్తవలస 202 కాల నీకి చెందిన మేకల సందీప్, గంటా మీన, ఆటో డ్రైవర్ మేకల హరిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించి నట్లు తెలిపారు. వీరి నుంచి బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి రహదారిలోని జాజులవాని పాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పరవాడ సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం.. అచ్యుతాపురం మండలం తమ్మ య్యపేటకు చెందిన ముచ్చు చిన్నారావు, భార్య హేమలత, కుమారుడు సాకేత్ ముగ్గురూ కలిసి ద్విచక్రవాహనంపై గాజు వాక వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమా దంలో ఈ ముగ్గురికి గాయాలవడంతో చికిత్సకు గాజువాక తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని సీఐ వెల్లడించారు.

అ వీ ఇ వీ

విధుల్లో పంచాయతీ కార్యదర్శులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు మంగళ వారం పలువురు బాధ్యతలు చేపట్టారు. కె. మాదవరావు (కె.వెంకటాపురం), పి.ఆర్.కృష్ణం జనేయులు (తంగేడు), కె.శ్రీనివాసరావు (పాములవాక), ఆర్.రవికిరణ్ (కొడవల్లి), ఆర్.వి.విజయలక్ష్మి (లైలాపట్నం), ఆర్.వి. సత్యనారాయణ (పందూరు), ఎ.రాజేంద్రప్రసాద్ (కొడవటిపూడి) పలు మండలాల్లో పనిచేస్తూ బదిలీపై గ్రామాలకు వచ్చారు. ఈ స్థానాల్లో ఇప్పటివరకు కార్యదర్శులుగా పని చేసినవారు వేరే మండలాలకు బదిలీ అయ్యారని ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు చెప్పారు.

ప్రకృతి వనరులు కాపాడండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రకృతి వనరు లను కాపాడాలని జిల్లా అటవీశాఖ విశ్రాంత అధికారి జానకిరామ్ కోరారు. కొండకర్ల ఆవ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వచ్ఛతే సేవలో భాగంగా మంగళవారం ర్యాలీ, శ్రమదాన కార్యక్రమాలు జరిగాయి. ఎస్‌డీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు, కార్యదర్శి పద్మా వతి, రమణ, అప్పారావు, ఏడిద లక్ష్మి, గోవింద, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

మునగపాక, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలిం తలకు నిత్యం అందుబాటులో ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎన్.విమలగిరి సూచిం చారు. మునగపాక పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో జాగ్రత్తలు పాటించేలా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. సీహెచ్‌ఓ ఆర్. దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, లక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

11న విశాఖకు మందకృష్ణ మాదిగ రాక!

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని సోషలిస్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టమూరి మంగ రాజు కోరారు. అనకాపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఈనెల 11న విశాఖపట్నంలో జరగ బోయే ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావే శానికి మందకృష్ణ మాదిగ హాజరవుతారని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొల్లి చిన్న అప్పారావు, కనకేశ్వర రావు, వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

రావికమతం, న్యూస్‌టుడే: కొట్నాబిల్లి పరిధిలో గ్రానైట్ క్వారీకి అనుమతి కోసం బుధవారం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకర ణను రద్దు చేయాలని సీపీఎం నాయకులు, గిరిజనులు కె.గడబపాలెంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇప్పటికే 12 క్వారీలు న్నాయని, వాటి నుంచి వచ్చే కాలుష్యంతో ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన చెందారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: సమస్య: అనకాపల్లి చవితినవారి వీధిలో కాలువ లేక వర్షం వస్తే నీరు రహదారిపై నిలి చిపోతుంది. వెంటనే కాలువలు నిర్మించాలి.

– రమ్యశ్రీ, అనకాపల్లి

✓: సమాధానం: కాలువ నిర్మాణాలకు ప్రతి పాదనలు పంపిస్తాం.

– సుమిత్ర, జీవీఎంసీ జోనల్ ఏఈ

సాగునీటి కాలువల ఆధునికీకరణ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఏషియన్ పెయింట్స్ ద్వారా సాగునీటి కాలువల ఆధునికీకరణ పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఏషి యన్ పెయింట్స్ అంబుజా ఫౌండేషన్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అనిల్‌కు మార్, వెంకట యాదవ్ తెలిపారు. తిమ్మరాజుపేటలో సర్పంచి శర గడం భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామసభలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సైతాన్ కాలువ శుభ్రం చేయడానికి సీఎస్ ఆర్ నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఇందులో రైతులు, గ్రామస్థులు 20 శాతం చెల్లించాలని, ఐది శ్రమదాన రూపంలోనైనా ఇవ్వవచ్చని తెలిపారు. రైతులను భాగస్వాముల్ని చేయడమే దీని లక్ష్యమన్నారు. కాలువను బాగుచేసిన తరవాత దీనిలో చెత్త వేయకుండా అవగాహన కల్పించాల న్నారు. ఇప్పటివరకు వ్యాపారం 30 గేట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈవీవైస్ రాము, కర్రి అప్పారావు, శరగడం నాగార్జున, శరగడం శివబా పునాయుడు, ఆడారి నర్సింగరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్

ఖాళీ స్థలాల్లో రసాయనాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలను నిర్వీర్యం చేసేందుకు బదులు విచ్చలవిడిగా వదిలేయడం విమర్శలకు దారితీస్తోంది. అచ్యుతాపురం సెజ్, నాన్ సెజ్‌లో 206 వరకు పరిశ్ర మలు ఉండగా వీటిలో 134 వరకు రెడ్‌జోన్ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో సింహభాగం ఫార్మా, రసాయన పరిశ్రమలే ఉన్నాయి. ప్రమాద కరమైన వ్యర్థాలను విడుదల చేసే కంపెనీలు ఉన్న చోట వీటి నిర్వహ ణపై నిఘా లేదు. ఇప్పటికే రసాయన వ్యర్థాలు శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి, కాలువల ద్వారా విడుదల చేస్తున్నారని మత్స్య కారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుప్పితూరు, మోటూరుపాలెం, ఉద్దపాలెం, చినపూడి, చిప్పాడ తదితర ప్రాంతాల్లో రహదారుల ఒడ్డున రాత్రి సమయంలో జన సంచారంలేని సమయాన ఈ వ్యర్థాలను విడిచిపె తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అయినా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీఐఐసీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



దుప్పితూరు రోడ్డులో ఇదీ పరిస్థితి..

బీఎన్ రహదారిలో గోతుల పూడ్చివేత

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బీఎన్ రహదారిలో ప్రమాదక రంగా మారిన గోతు లను పూడ్చివేత పనులు చురుగ్గా జరు గుతున్నాయి. వడ్డాది నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో బంగారుమెట్ట కూడలి దగ్గర పెద్ద గోతులతో రోడ్డు ఎత్తుపల్లాలుగా తయారైంది. ఇక్కడ రోడ్డును తవ్వేసి చదును చేయించారు. బుదిరెడ్లపాలెం, వడ్డాది వద్ద గుంత లను పూడ్చి రోడ్డును చదును చేయించడంతో రాకపోకలు సాగించేం దుకు ఇబ్బందులు తొలగాయి.



వ్యాఘ్రవాహినిగా కన్యకాపరమేశ్వరి



అనకాపల్లిలో..



కశింకోటలో..



ఎలమంచిలిలో..

అనకాపల్లి పట్టణం, కొత్తూరు, నెహ్రూచౌక్, కశింకోట, న్యూస్‌టుడే: శర న్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనకాప ల్లిలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మంగళవారం వ్యాఘ్రవాహినిగా అలంక రించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకు న్నాయి. నూకాలమ్మ ఆలయంలో మాన్యు హోమం నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సతకంపట్టు వద్ద కనకదు ర్గను మహాలక్ష్మీదేవిగా అలంకరిం చారు. అమ్మవారిని తెదేపా బీసీ సాధికారసమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సత్యనారా యణపురం కల్యాణగిరిపై కన కదుర్గమ్మ మహాలక్ష్మిగా పూజ లందుకున్నారు. పెద్దిరాజుపే టలో చౌడేశ్వరి దేవి వ్యాఘ్ర వాహిని అలంకరణలో పూజలు అందుకున్నారు. పిసినికాడ కనక దుర్గమ్మ క్షీరాబ్ధి కన్యకగా పూజలందుకు న్నారు. అమ్మవారికి సామూహిక కుంకు మార్చనలు నిర్వహించారు. సర్వమంగ ళాంబను మహాలక్ష్మీదేవీగా అలంకరించి 108 తామరపువ్వులతో అర్చన చేశారు. గవరపాలెం శ్రీగౌరీ పంచాయతన దేవాల యంలో మహిళలు సహస్ర పసుపుకొ మ్ముల పూజ చేశారు. గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్య దర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశా ధికారి శరగడం జగదీష్ పాల్గొన్నారు. శ్రీకామాక్షిదేవి సరస్వతిదేవిగా దర్శనమి చ్చారు.

ఎలమంచిలి/ గ్రామీణం, అచ్యుతా పురం, మునగపాక, న్యూస్‌టుడే: ఎల మంచిలిలో వాసవీమాతను రాజరాజే శ్వరి దేవి అవతారంలో అలంకరిం చారు. పెంజెరువు వద్ద దుర్గాదేవి ఆల యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిం చారు. బయ్యవరంలో కోలాటాల ఆకట్టు కున్నాయి. హరిపాలెం-అందలాపల్లి శ్రీభ గీరథీ అమ్మవారి మండపంలో శివలింగ ఆకారంలో దీపాలంకరణ ఆకట్టుకుంది. సమరసతా ఫౌండేషన్ సబ్ డివిజనల్ కన్వీనర్ బీవీ రమణ తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు. వాడ్రాపల్లిలో అంబలం పూజ నిర్వహించారు. వందలా దిమంది భవానీ భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవు రట్ల, న్యూస్‌టుడే: నక్కపల్లి, కాగిత ఆల యాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాజులతో అలంకరించారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరం-అగ్రహారంలో భవానీ భక్తులంతా వీధుల్లో పేటతుళ్లి ఆడారు. దార్లపూడి, నక్కపల్లి మండలం దేవవరంలో భారీ అంబలం పూజ నిర్వ హించారు. కోటవురట్లలో సంతబయల దుర్గాదేవి పీఠం వద్ద భారీ అంబలం పూజకు పలు గ్రామాల నుంచి భవాని మాలధారులు తరలివచ్చారు.



బయ్యవరంలో ఘటాల ఊరేగింపు



గవరపాలెంలో..



దార్లపూడి అంబలం పూజలో భవానీలు

తుమ్మపాలలో సారె ఊరేగింపు

అనకాపల్లి పట్టణం: తుమ్మపాల కొత్తపేట వీధిలోని బాల గణపతి యువజనసేవా సంఘం ఆధ్వర్యంలో భవానీలు మంగళవారం సారె ఊరేగించారు. 108 రకాల పిండి వంటకాలతో ప్రదర్శన పాల్గొన్నారు. తప్పెటగుళ్లు, కోలాటం నృత్య ప్రదర్శనలతో ఈ ఊరే గింపు సాగింది. కొత్తపేట వీధి భక్తులు పాల్గొన్నారు.



వెంకన్నకు తిరువీధి సేవ

నక్కపల్లి, న్యూస్‌టుడే: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న సతీసమేతంగా మంగ ళవారం తిరువీధుల్లో ఊరేగారు. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను సప్పర వాహనంలో ఊరేగించారు. అంతకుముందు విశేష పూజలు చేశారు. తర్వాత బలిహరణ గావిం చారు. అనంతరం సన్నాయి వాయిద్యా లతో తిరు వీధి సేవ జరిపారు.



స్వామిని ఊరేగిస్తున్న పండితులు

భవానీలకు అన్నసమారాధన

లక్ష్మీదేవి పేట(అనకా పల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని విజయరామ రాజుపేటలో మంగళవారం భవానీ మాలధారులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. నవదుర్గా యూత్ ఆధ్వ ర్యంలో దుర్గాదేవి పూజలు నిర్వహిస్తున్నారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను జనసేన ఇన్ ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రామకృష్ణను సత్కరించారు.



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న రామకృష్ణ

నేతల ఆదేశాలు పట్టని అధికారులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: అధికారులు ఉదా సీన వైఖరి విమర్శలకు దారితీస్తోంది. ఓ వైపు మొక్కలు నాటాలని ప్రచారం చేస్తూనే మరో వైపు చెట్లు అక్రమంగా నరికివేతకు గురవుతున్నా పట్టిం చుకోవడం లేదు. ఎలమంచిలిలో రోడ్లు, భవనాల శాఖకు చెందిన అతిథి గృహానికి సమీపాన చెట్టును పట్టపగలే నరికివేశారు. రేగుపాలెం రోడ్డులో చెట్లను ఒక స్థిరాస్తి వ్యాపారి నరికించి అమ్ముకున్నా అధికారుల్లో చలనం రాలేదు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఈ స్థలాన్ని రోడ్లు భవనాలశాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అయినా ఇంతవరకూ చర్యలు లేవు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని వృక్ష ప్రేమికులు కోరుతున్నారు.



ఎలమంచిలి-రేగుపాలెం రహదారిలో.. (పాతచిత్రం)

రైతులకు రూ. 10 వేల పరిహారం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: వర్షాలకు పంటలు నష్టపోయిన రైతు లకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం అందిస్తామని జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రభాకర రావు పేర్కొన్నారు. శంకరం, గొలగాం గ్రామాల్లో మంగళ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటపొలాలను పరిశీలించి పంటలకు సోకిన తెగుళ్లు పరిశీలించి నివారణకు తీసుకోవాలని జాగ్రత్తలు వివరించారు. శంక రంలో 130 మంది రైతులకు త్వరలో పరిహారం అందిస్తామన్నారు. ఉద్యాన అధికారి లావణ్య, ఏఓ రంగాచారి, రైతులు పాల్గొన్నారు.



శంకరంలో అధికారులు, రైతులు

ఎలమంచిలి గ్రామీణం, మునగపాక, కశింకోట, న్యూస్‌టుడే: వరిలో తెగుళ్ల ఉద్ధృతిని నివారించడానికి పురుగుల మందులు పిచికారీ చేయాలని ఏడీఏ ప్రభాకర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో వరిలో ఆకు ముడత, పాము పొడ తెగులు సోకుతున్నట్లు గుర్తించామ న్నారు. ఏవో మోహనరావు సిబ్బంది పాల్గొన్నారు. మునగపాక మండలం ఒంపోలు, అరబుపాలెంలో పొడతెగులు, కొమ్ముపురుగు, ఆకుముడత పురుగు వ్యాపించినట్లు ఏఓ సీహెచ్ జ్యోత్స్నకుమారి పైర్లను పరిశీలించారు. కశింకోట మండలం గురువు భీమవరంలో సూక్ష్మ నీటిపారుదల శాఖ ప్రాంతీయ సమన్వయకర్త రంజిత కూరగాయ తోటలను సందర్శించారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: వాకపాడు, ఉప్పరాపల్లి గ్రామాల్లో ఏఓ సౌజన్య రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు సుడిదోమ ఆశించే ప్రమాదం ఉందని, దీని నివారణకు బుప్రోజెన్ 1.6 మిల్లీలీటర్లు లేదా అసిఫెట్ 1.5 గ్రాములు లీటర్‌లో వరి దుబ్బుకు తగిలేలా పిచికారీ చేయాలని సూచించారు. పొడ తెగులు ఉన్నట్లయితే నివారణకు హెక్సాకొనజల్ రెండు మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

మహిళలపై వేధింపుల నివారణకు కమిటీలు

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపుల నివారణకు కమి టీలు వేయాలని ఆర్జేడీ చిన్మయిదేవి పేర్కొ న్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో కిశోర వికాసంపై జిల్లాలోని సూపర్ వైజర్లు, సీడీపీవోలకు వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅ తిథిగా హాజరైన ఆమె మాట్లా డుతూ 10 మంది పనిచేస్తే నలుగురు సభ్యులతో కమిటీ వేయాలన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించా లన్నారు. కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 11 నుంచి 18ఏళ్ల లోపు చదువు మానేసిన కిశోర బాలికలను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. 5 నుంచి 10 మందితో గ్రూపులు ఏర్పాటు చేసి అవ గాహన కల్పించాలన్నారు. అవసరమైన వారికి స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ, వృత్తి విద్యాకోర్సులు నేర్పించడం ఇలా ఆసక్తి గమనించి వాటిని నేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి ఎల్.సుజాత, పీడీ అనంతలక్ష్మి, సీడీపీవోలు, సూపర్‌వై జర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

భాజపా కార్యకర్తల సంబరాలు

మునగపాక, న్యూస్‌టుడే: హరి యాణాలో భాజపా విజయంతో హ్యాట్రిక్ సాధిం చడంతో తోటాడలో ఆపార్టీ నాయకులు మంగళవారం రాత్రి సంబరాలు చేసుకొన్నారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ప్రధాని మోదీ పాలనపై హరియాణ ప్రజలు మరోసారి విశ్వాసం చూపారని అన్నారు. నాయకులు వుడా రమేష్, చదరం సూరి అప్పారావు, పి.నాగభూషణం, సంతోష్ పాల్గొన్నారు.



తోటాడ కూడలిలో మిఠాయిలు పంచుతున్న నాయకులు

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

స్పందనకు వందనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కుమారపురం శివారు రత్నాయంపేట సహా పలు ప్రాంతాల్లో సాగుతున్న ఇసుక తవ్వకాలపై 'ఈనాడు'లో సోమవారం 'తీరంలో తోడేస్తున్నారు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై సీఐ అప్పన్న స్పందించారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశామని, తవ్వ కాలు సాగిస్తే చర్యలు తప్పవని సీఐ అప్పన్న పేర్కొన్నారు.

గ్రంథాలయ స్థాపనకు కృషి

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ స్థాపనకు కృషి చేసిన మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిని మంగళవారం సిద్దార్థ సోషల్ సర్వీస్ సంస్థ అధ్యక్షులు బళ్లా నాగభూ షణం ఆధ్వర్యంలో ప్రతినిధులు సత్కరించారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, సంస్థ ప్రతి నిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూరి రామా రావు, బొడ్డు సోమరాజు, వుడా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్యవతిని సత్కరిస్తున్న ప్రతినిధులు

డిమాండ్ల సాధనకు 14న ధర్నా

మునగపాక, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న కలెక్టరేట్, డీఎం హెచ్‌ఓ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాలో అందరూ పాల్గొవాలని యూనియన్ గౌరవాధ్య క్షుడు ఏవీ నాగేశ్వరరావు కోరారు. పనిభా రంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

సోలాపురమ్మ పండగ రేపు

చోడవరం పట్టణం: గాంధీ గ్రామం రమణయ్యపేటలో ఈ నెల 10న సోలాపురమ్మ పండగ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ మంగళవారం పేర్కొంది. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయి.

★ స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు అర్చకుడు చలపతి చెప్పారు.

చోడవరంలో ఎమ్మెల్యే బండారు కార్యాలయం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చోడవరంలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలకు బుధవారం నుంచి చోడవరంలో అందుబాటులో ఉండనున్నారు. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం ఉన్నా.. స్వగ్రామం వెన్నెలపాలెం నుంచి రావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో చోడవరంలో నివాసం ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో మళ్లీ పాత అధికారులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో తాజాగా పలువురు అధికారులు బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్.ఐ.) లక్ష్మి పార్వతీపురానికి బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో నీలిమ బాధ్యతలు చేపట్టారు. డీఈ నారాయణను విశాఖ కార్పొరేషన్‌కు పంపించి, అక్కడ నుంచి డీఈ కామేశ్వరరావును ఇక్కడ నియమించారు. వీరిద్దరూ గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులే. పట్టణ ప్రణాళిక అధికారి (టీపీఓ) వేంకటేశ్వరరావుకు ఆముదాలవలసకు బదిలీ అయింది. ఈయన స్థానంలో ఇంకా ఎవరూ రాలేదు. ఆముదాలవలస నుంచి పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్‌గా సత్యనారాయణ నియమితులయ్యారు. ఇక్కడి సీనియర్ అకౌంటెంట్ రామారావు ఎలమంచిలికి వెళ్లగా, అక్కడి నుంచి బీబీ నర్సీపట్నానికి వచ్చారు.

బురద.. దుర్వాసనతో బెడద



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన నీరు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం ఎ.ఎల్.పురం మేజర్ పంచాయతీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొలుగొండ, కొయ్యూరు, గూడెంకొత్తవీధి మండలాలకు ఇది ప్రధాన కూడలి కావడంతో ఇక్కడి నుంచి వ్యాపారులు అత్యధిక సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో అయ్యన్నపాత్రుడు ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం నిర్వహణ సరిగా లేదు. ప్రయాణికులకు మరుగుదొడ్లు శుభ్రంగా లేవు. పారిశుద్ధ్యం కార్మికులకు నెలలు తరబడి జీతాలు చెల్లించకపోవడంతో విధులకు స్వస్తిచెప్పారు. ఫలితంగా ఆవరణలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. పంకాలు లేవు, కుర్చీలు శిథిలమయ్యాయి. కొద్దిపాటి వర్షం వస్తే చాలు సముదాయం అంతా బురదమయమవుతోంది. పందులు పొర్లడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాంప్లెక్స్‌లో వసతులు మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇసుకాసురులదే ఇష్టారాజ్యం...



నర్సీపట్నం నియోజకవర్గంలోని నదులు, గెడ్డలు ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారాయి. కాసేపు కష్టపడితే చాలు... కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. రేయింబవళ్లూ ఎద్దుల బళ్లపై, ట్రాక్టర్లపై నిర్భయంగా తరలించేస్తున్నారు. విచ్చలవిడిగా అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. దీంతో ఎవరూ ఏం చేయలేరన్న ధీమాతో నిత్యం వేల క్యూబిక్కు మీటర్లు తవ్వేస్తున్నారు.

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

✦ నర్సీపట్నం మండలంలో వరాహనదిలో, మాకవరపాలెం మండలం సర్పానదిలో ఇసుక అనధికారికంగా తరలుతోంది. మాకవరపాలెంలో ఎనిమిది ట్రాక్టర్లు నిత్యం ఈ పనిలోనే ఉంటున్నాయి. గొలుగొండ మండలం చోద్యం కూడలి నుంచి బొడ్డేరు గెడ్డపై వంతెన వరకు వెళితే చాలు రోడ్డుపక్కనే ఎద్దులబళ్లతో ఇసుక తెచ్చి నిల్వ చేయడం, దాన్ని ట్రాక్టర్లకు ఎత్తి తరలించడం బహిరంగంగానే కనిపిస్తోంది. చోద్యం వంతెన కింద, లింగంపేట సమీపంలోని తాగునీటి బావుల వద్దా తవ్వేస్తున్నారు.

✦ నర్సీపట్నం పురపాలక సంఘంలో అనేక భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. స్థానికంగా ఇసుక యార్డులో ఉచిత ఇసుక అందుబాటులో లేకపోవడంతో చాలామంది అనధికారికంగానే కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి తెల్లారేవరకు పట్టణంలోకి వస్తున్న ట్రాక్టర్లు ఎక్కువగా నాతవరం మండలంలోని తాండవ నది నుంచి వస్తున్నాయి. నదిలో ఇసుక తవ్వి ఎద్దులబండ్లతో ఎత్తి రోడ్డుకు చేర్చి ట్రాక్టర్‌లో నింపినందుకు ట్రాక్టర్ యజమాని రూ. 2100 వరకు చెల్లిస్తున్నారు. దాన్ని నర్సీపట్నంలో దూరాన్ని బట్టి రూ. 7 వేల నుంచి రూ. 8 వేల ధరకు అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్లను పట్టుకోకుండా ఉండేందుకు నెలకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10 వేలు మామూలుగా తీసుకుంటున్నారని సమాచారం.

✦ అక్రమ తవ్వకాల కారణంగా వంతెనలు దెబ్బతినే ప్రమాదం ఉంది. తాగునీటి బావుల వద్ద తవ్వితే నీటి స్వచ్ఛత, లభ్యత తగ్గిపోతుంది. సాగునీటి కట్టడాలకు ముప్పు వాటిల్లుతుంది. సొంత అవసరాలకు ఎద్దుల బళ్లతో తీసుకువెళ్లడం ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఇందుకు విరుద్ధంగా అమ్ముకోవడానికి మాత్రమే చాలామంది తవ్వుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వుకుపోతున్నారు.



చోద్యం వంతెన వద్ద రోడ్డుపక్క ఎద్దుల బళ్లపై తరలింపు



నాతవరం మండలం నుంచి నర్సీపట్నానికి ట్రాక్టరుతో తెచ్చిన లోడు

ఇసుక అక్రమ తవ్వకాలను సీఐ రేవతమ్మ దృష్టికి తేగా చట్టవిరుద్ధంగా తవ్వకాలు జరిగితే సహించేది లేదన్నారు. చోద్యం వంతెన వద్ద బొడ్డేరు గెడ్డలోకి ఎద్దులబళ్లు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఇలాగే వదిలేస్తే వంతెనకు ముప్పు!

కె.కోటపాడు మండలం చౌడువాడ నుంచి జుత్తాడ వెళ్లే మార్గంలో చిట్టి గెడ్డపై వంతెన మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వంతెన చెంతనే గెడ్డలో ఇసుక తవ్వకాల వల్ల ఈ దుస్థితి నెలకొంది. పిల్లర్ల పునాదులు బయటపడి గాలిలో తేలుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇలాగే వదిలిస్తే వంతెన కూలిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కె.కోటపాడు



అ వీ ఇ వీ

మద్యం దుకాణాలకు 160 దరఖాస్తులు

చోడవరం పట్టణం: చోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు మద్యం దుకాణాలకు 160 దరఖాస్తులు వచ్చాయని సీఐ నాయుడు మంగళవారం తెలిపారు. చోడవరం మండలంలో 8 దుకాణాలకు 38, బుచ్చెయ్యపేటలో ఐదుకు 51, కె.కోటపాడులో ఐదుకు 40, దేవరాపల్లిలో నాలుగు దుకాణాలకు 29 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఆశా కార్యకర్తల సేవలు విలువైనవి

గొలుగొండ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత మహిళలకు ఆశా కార్యకర్తలు మంచి సేవలు అందిస్తున్నట్లు సామాజిక ఆరోగ్య సమన్వయకర్త సీహెచ్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యాధికారి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

గొలుగొండ: విద్యుత్తు ఛార్జీలు భారీగా పెరగడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రామునాయుడు పేర్కొన్నారు. మంగళవారం చోద్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సర్కారు ఈ సమస్యపై దృష్టి సారించి సామాన్యులను ఆదుకోవాలని కోరారు.

ఒప్పంద ఉద్యోగుల సమ్మె 16 నుంచి

చోడవరం: ఆసుపత్రుల్లోని ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 16 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ సంఘం ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పేర్కొన్నారు. చోడవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట మంగళవారం ఒప్పంద ఉద్యోగులతో కలిసి ఆందోళన చేపట్టారు.

మద్దతు ధర ప్రకటించాలని వినతి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: జీడి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాయనబాబు కోరారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని కింతాడ సచివాలయ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. యర్రా దేముడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారికి సన్మానం

రావికమతం: బదిలీపై కె.కోటపాడు మండలానికి వెళ్తున్న ఇంజినీరింగ్ అధికారిణి పి.సుమతిని మంగళవారం సన్మానించారు. ఆమె 13 ఏళ్లుగా రావికమతం ఏఈగా పనిచేశారు. ఎంపీపీ రాజు, వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, వెంకటరమణ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వైకాపా మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, రావికమతం సర్పంచి మోదినారాయణ, లక్ష్మీనాగేశ్వరరావు, సత్యదేవ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: గురుకులపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళుతున్న కర్రి ఉర్ధిరికి మంగళవారం నాయకులు, గ్రామస్థులు వీడ్కోలు పలికారు. మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచి వెంకటరమణ పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలంలో పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు నందనవనంలో సీపీఎం మండల కమిటీ సమావేశం సాపిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన మంగళవారం జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, అడిగర్ల రాజు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే వర్గీకరణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే వర్గీకరణ సాధించుకో గలిగామని మహాసేన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు అన్నారు. నర్సీపట్నంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న విశాఖ జిల్లాకు విచ్చేస్తున్న మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉమ్మడి విశాఖ ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు చిందాడ నూకేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఆశయాలను నేటితరం యువత అందిపుచ్చుకోవాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) జోనల్ ఇన్‌ఛార్జి ఎం.అప్పారావు కోరారు. గొలుగొండ మండలం గింజర్తిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. చిట్టిమూరి శ్రీనివాబు. చినదేముడు, బోగేసు, నాయకులు చిట్ల చలపతి తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **జోకర్ ఫోలి అడు, కలి, సత్యం సుందరం,** ఆడి2: **స్వాగ్** ఆడి3: **దేవర,** ఆది4: **దేవర, సత్యం సుందరం** రాజు:**శ్వాగ్,** బంగారాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **శ్వాగ్,** పూర్ణా: **దేవర**

సహజ వనరుల దోపిడీని అడ్డుకుంటాం



మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల సంఘం అధ్యక్షుడు కల్యాణం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సహజ వనరులు దోపిడీని అడ్డుకుంటామని పలువురు గిరిజన నేతలు పేర్కొన్నారు. సమత, గిరిమిత్ర సంఘాల నేతృత్వంలో మంగళవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో ఆదివాసీ హక్కుల సంఘం అధ్యక్షుడు ఎన్.కల్యాణం మాట్లాడుతూ పెసా చట్టాన్ని సమర్థంగా అమలు చేసినప్పుడే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నేటితరం గిరిజన యువత గిరిజన రక్షణ చట్టాలను, గ్రామసభల ప్రాముఖ్యతను సంపూర్ణంగా తెలుసుకోవాలని సూచించారు. గిరిమిత్ర కార్యదర్శి బండి గంగరాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో పల్లె ప్రగతికి పట్టాభిషేకం- పెసాచట్టం-1996 పుస్తకాలను ఆవిష్కరించారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.జనార్దన్, సమత సంస్థ సమన్వయకర్తలు జి.సైమన్, పెసా కమిటీ సభ్యుడు బత్తుల కృష్ణ, బీఎస్పీ నాయకుడు బి.నాగరావు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎన్ రహదారిలో గోతుల పూడ్చివేత



బంగారుమెట్ట వద్ద మట్టిని సరిచేస్తున్న పొక్లెయిన్

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బీఎన్ రహదారిలో ప్రమాదకరంగా మారిన గోతులను పూడ్చివేత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వడ్డాది నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో బంగారుమెట్ట కూడలి దగ్గర పెద్ద గోతులతో రోడ్డు ఎత్తుపల్లాలుగా తయారైంది. ఇక్కడ రోడ్డును తవ్వేసి చదును చేయించారు. బుదిరెడ్లపాలెం, వడ్డాది వద్ద గుంతలను పూడ్చి రోడ్డును చదును చేయించడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగాయి. వర్షాలు పూర్తిగా తగ్గాక రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని గుత్తేదారు సంస్థ ప్రతినిధి చెప్పారు.

ప్రతి పల్లెలో గుడిగంటలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పల్లెల్లో ఇక గుడి గంటలు మారుమోగనున్నాయి. ధూప, దీప నైవేద్యాలతో చిన్న ఆలయాలన్నీ కళకళలాడనున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవతో వీటికి మహర్దశ పడుతోంది. దేవాలయాలనే నమ్ముకొని ఇబ్బందులతో బతుకులు సాగిస్తున్న అర్చకుల జీవితాల్లోనూ వెలుగులు ప్రసరించనున్నాయి. ఎన్నికల హామీలో భాగంగా సర్కారు ఇప్పుడు ధూప, దీపాలకు అందజేసే సాయం రూ.10 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై భక్తులు, పురోహితులు అందరిలోనూ హర్షం వ్యక్తమవుతోంది. ఆధ్యాత్మికతకు నెలవైన గ్రామాల్లోని గుడుల అభివృద్ధిని వైకాపా ప్రభుత్వం పెద్దగా దృష్టి పెట్టలేదు. ధూప, దీప, నైవేద్యం పథకం (డీడీఎన్ఎస్) కింద కేవలం రూ. 5 వేలు మాత్రమే ఇచ్చింది. ఇందులో రూ. 2 వేలు ధూప, దీపాలకు, మిగతా రూ.3 వేలు అర్చకునికి జీతంగా నిర్ణయించారు. ఈ సొమ్ము ఎటూ చాలని పరిస్థితిలో ఆలయాలు జీర్ణావస్థలో మగ్గుతున్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ సాయం రూ.10 వేలకు పెంచింది. అనకాపల్లి జిల్లాలో చిన్న ఆలయాలు సుమారు 81 వరకు ఉన్నాయి. దాదాపుగా అన్నిచోట్ల ప్రభుత్వం నుంచి అందే సాయంతోనే పూజారులు గుడి నిర్వహణ చూస్తూ వస్తున్నారు. ఇప్పుడు మొత్తం 81 ఆలయాలకు రూ. 10 వేల సాయం పెంపు వర్తించనుంది.



నర్సీపట్నంలోని ప్రాచీన సీతారామస్వామి ఆలయం

చిరకాల కల నెరవేరింది



ఆలయాల అర్చకుల చిరకాల కల నెరవేరింది. గత పదేళ్ల నుంచి రూ.5 వేలు ఇస్తున్నారు. ఈ సొమ్ముతో గుడి నిర్వహణకు తోడు కుటుంబ పోషణ కష్టతరమయ్యేది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం తమ పట్ల కరుణతో ఈ మొత్తాన్ని రెట్టింపు చేసి ఆదుకుంటోంది. చిన్న గుడులు ఇక కళకళలాడుతాయి.
– రేజేటి శ్రీనివాసాచార్యులు, నర్సీపట్నం

ఎంతో రుణపడి ఉంటాం



ఇన్నాళ్లకు దేవాలయాల్లోని పూజారుల కష్టాలను అర్థం చేసుకున్నారు. చాలీచాలని డబ్బులతో ధూప, దీపాలకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. సర్కారు సాయం పెంచడంతో ఇబ్బందులన్నీ గట్టెక్కుతాయి.
– రాయవరపు రామశర్మ, వెలమవీధి

పండగ రోజుల్లో ఆనందాన్ని తెచ్చింది



ధూప, దీప, నైవేద్య పథకం మొత్తాన్ని పెంచడంతో ప్రస్తుత పండగ రోజుల్లో అందరూ ఎంతో ఆనందంగా ఉన్నారు. ఇప్పటి వరకు అరకొర సొమ్ముతో దేవుడికి మనసారా ఏ సేవ చేయలేని దుస్థితి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సాయాన్ని రూ.10 వేలు చేసి అర్చకులందరికీ న్యాయం చేస్తోంది.
– సూరి కామేశ్వరశర్మ, చమ్మచింత

అర్చకులకు ఉపశమనం



ధూప, దీప, నైవేద్యాలకు అందించే మొత్తం పెంపుపై ఉత్తర్వులు జారీ అయ్యాయి. పెంచిన మొత్తం నవంబరు నెల నుంచి అమలయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా అర్చకులకు ఎంతో ఉపశమనం లభించడంతో పాటు చిన్న ఆలయాలు ఇక కళకళలాడనున్నాయి. ప్రభుత్వం నుంచి వెలువడే మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోనున్నాం. – కె.సుధారాణి, జిల్లా దేవాదాయ శాఖాధికారి, అనకాపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

?: గొండుపాలెం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే తుప్పల వలన ఇబ్బంది అవుతోంది.
-సాకుడు, గొండుపాలెం

✓: పరిశీలించి తుప్పల తొలగింపునకు చర్యలు చేపడతాం.
- సత్యనారాయణ, ఏఈ, ర.భ.శా.

మహాలక్ష్మిగా దుర్గమ్మ దర్శనం



పాతకృష్ణదేవిపేటలో అగ్నిగుండం



నర్సీపట్నంలో..



చోడవరంలో మహిళల లలితా సహస్రనామ పారాయణ



బలిఘట్టంలో..



సీతయ్యపేటలో..



మేడివాడలో..

నర్సీపట్నం/అర్బన్, నాతవరం, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గమ్మ మంగళవారం మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బలిఘట్టంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. వేములపూడి దుర్గాదేవి ఆలయంలో హరిభజనలు కొనసాగాయి. కొత్తమల్లంపేటలో అంబలం భజన, పాతకృష్ణదేవిపేటలో అగ్నిగుండం నిర్వహించారు. నాతవరం శక్తి పంచాయతన ఆలయంలో చండీయాగం నిర్వహించారు.

చోడవరం పట్టణం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట: చోడవరం దుర్గాదేవి ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో రూ.500, రూ.200, రూ.100 నోట్లతో అమ్మవారిని అలంకరించారు. సీతయ్యపేటలో శ్రీచక్రార్చన, దేవీ త్రిరాత్రి వ్రతం, పంచామృత అభిషేకం కొనసాగాయి. వడ్డాది కూడలిలోని గీతాశ్రమంలో అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. రోలుగుంట, బుచ్చెంపేట గ్రామాల్లో మండపాల వద్ద దీపాలంకరణలో భక్తులు పాల్గొన్నారు. చిలకవానిపాలెంలో గుంటూరు లక్ష్మణరావు ఆధ్వర్యంలో భవానీలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల గ్రామీణం: చౌడువాడ, గుల్లిపల్లి, సింగ్రంగి గ్రామాల్లో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. అప్పలరాజుపురం కొండపై లలితాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు కొనసాగాయి. దేవరాపల్లిలో ఆటో యూనియన్ నాయకులు అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. జంపెనలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కేసులు



మాకవరపాలెం రహదారిపై దుకాణాలను తీయిస్తున్న సీఐ రేవతమ్మ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ప్రధాన రహదారిపై వ్యాపార దుకాణాలను ఏర్పాటు చేసి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి చేయొద్దని సీఐ రేవతమ్మ అన్నారు. మాకవరపాలెం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాలను మంగళవారం ఆమె తొలగించారు. దుకాణాలు రహదారిపై పెట్టడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించే దుకాణాలు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై దామోదర్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి బాలదొర పాల్గొన్నారు.

నాతవరం: నాతవరంలో రహదారి ఇరువైపులా ఆక్రమణకు గురవడంతో రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతోంది. ఆసుపత్రి నుంచి బస్సు కూడలి వరకూ ఉన్న ఆక్రమణలు పూర్తిగా తొలగించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దసరాలోగా వేతన బకాయిలు చెల్లించాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి వేతన బకాయిలను దసరా పండగలోగా చెల్లించాలని ఏపీ వైద్య ఉద్యోగులు, కార్మికుల సంఘం నాయకుడు ఎల్.వి.రమణ డిమాండ్ చేశారు. కార్మికులు 48 రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న గుత్తేదారుపై చర్యలు తీసుకోవడంతోపాటు కాంట్రాక్టును రద్దు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 16 నుంచి సమ్మెలోకి దిగుతామన్నారు. పార్వతి, సత్యవతి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిబ్బంది

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి



ఆర్డీఓకు మొక్క అందిస్తున్న కె.కోటపాడు తహసీల్దార్, ఉద్యోగులు

దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: రెవెన్యూ సంబంధ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అనకాపల్లి ఆర్డీఓ ఎస్.అయిషా తహసీల్దారు లక్ష్మీదేవికి సూచించారు. దేవరాపల్లి, కె.కోటపాడు తహసీల్దారు కార్యాలయాలను మంగళవారం ఆమె సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో వేర్వేరుగా సమావేశమయ్యారు. తహసీల్దార్ భాగ్యవతి, ఉప తహసీల్దార్లు అప్పారావు, రమేశ్ పాల్గొన్నారు.

పంటల తెగుళ్లపై అప్రమత్తం



జెడ్.కొత్తపట్నంలో వరి దుబ్బును ఏఓకు చూపుతున్న రైతులు

నర్సీపట్నం గ్రామీణం, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: వరి పొలాలను పాముపొడ తెగులు ఆశించడాన్ని గమనించినట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు శ్రీదేవి చెప్పారు. గబ్బాడలో మంగళవారం పొలం పొలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పాముపొడ తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. వరి ఈనెలు పసుపు రంగులో మారుతుండటం గమనిస్తే.. 20 కిలోల పొటాష్ వేయాలన్నారు. వ్యవసాయాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. గొలుగొండ వ్యవసాయాధికారిణి సుధారాణి పాకలపాడు, పుత్తడిగైరంపేట గ్రామాల్లో పొలాలను సందర్శించి పంటలకు సోకిన తెగుళ్ల నివారణపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అధికంగా ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు.

రావికమతం, మాడుగుల గ్రామీణం: పంటల సాగులో సమగ్ర పోషక యాజమాన్య చర్యలు చేపట్టాలని మాడుగుల వ్యవసాయాధికారి వాసుదేవరావు సూచించారు. ఎం.కోడూరు. సాగరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్త సౌజన్య పాల్గొనన్నారు. జెడ్.కొత్తపట్నంలో వ్యవసాయ అధికారుల బృందం పర్యటించింది. వరి పైరును ఆకుముడత, సుడిదోమ, పాముపొడ తెగుళ్ల వ్యాప్తించినట్లు గుర్తించిన వ్యవసాయాధికారి రూప నివారణ చర్యలను రైతులకు వివరించారు.

చీడికాడ: కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాబు సూచించారు. దిబ్బపాలెం, వరహాపురం, తునివలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి రమాదేవి, దిబ్బపాలెం సర్పంచి నీరజ, ఎంపీటీసీ సభ్యుడు పెద్దినాయుడు, నాయకులు కొండబాబు, రాజబాబు, శ్రీను, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని ఆందోళన



గదబపాలెంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

రావికమతం, న్యూస్‌టుడే: కొట్నాబిల్లి రెవెన్యూ పరిధిలో గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇచ్చే విషయమై బుధవారం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సీపీఎం నాయకులు, గిరిజనులు కె.గదబపాలెంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు-1లో 3.219 హెక్టార్లలో క్వారీ అనుమతులకు ఓ సంస్థ దరఖాస్తు చేసింది. దీనిపై మైనింగ్ అధికారులు కొట్నాబిల్లిలో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ ఏర్పాటు చేశారు. కొట్నాబిల్లి రెవెన్యూ పరిధిలో ఇప్పటికే 12 క్వారీలున్నాయని, వాటి నుంచి వచ్చే కాలుష్యంతో ఆరోగ్యం దెబ్బతింటోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెంలోని మత్స్యకారులకు సింహాద్రి ఎన్టీపీసీలో ఉపాధి కల్పించాలని సర్పంచి చింతకాయల సుజాత, మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు కోరారు. ఈ మేరకు సంస్థ అడ్మిన్ భవనంలో జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీ వ్యర్థ జలాలు, ఫ్లైయాష్ తీరంలో కలవడం వల్ల మత్స్య సంపద నశించి వేటసాగక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో 60 మందికి ఉపాధి కల్పిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని ఇప్పటికీ ఆ ఉద్యోగాలు ఇవ్వలేదని వినతిలో పేర్కొన్నారు.

వారు చేయరు.. వీరిని చేయనివ్వరు..

జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయలోపం

వేపగుంట - పినగాడి రహదారికి వీడని గ్రహణం


అతుకుల బొంతలా వేపగుంట - పినగాడి రహదారి


దారంతా ఇదే దుస్థితి

వేపగుంట, న్యూస్‌టుడే

తాను పెట్టదు.. ఇంకొకరి పెట్టనివ్వదు అన్న చందంగా మారింది జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ అధికారుల తీరు. ఈ రెండు శాఖల సమన్వయలోపం కారణంగా ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. జీవీఎంసీ జోన్-8 పరిధిలోని అత్యంత రద్దీ కలిగిన రహదారిలో వేపగుంట - పినగాడి రోడ్డు ఒకటి. గత వైకాపా ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనా పట్టించుకోలేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్టమొదట ఈ రహదారినే నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన పంచకర్ల రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలుపొంది 100 రోజుల పాలన పూర్తి చేసుకున్నారు. అయినప్పటికీ రోడ్డును మాత్రం బాగు చేయలేకపోయారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటే పనులు జరుగుతాయని ప్రజలు చెబుతున్నారు.

ఎన్నికలకు ముందు హడావిడిగా..

వేపగుంట - పినగాడి రహదారి ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉంది. గుంతలతో అధ్వానంగా తయారవ్వడంతో రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.13 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అప్పటి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. కొద్దిరోజులు తూతూమంత్రంగా పనులు జరిగాయి. గుత్తేదారుకి బిల్లులు చెల్లింపులో ఆలస్యం కావడంతో ఆయన చేతులెత్తేసి వెళ్లిపోయినట్లు సమాచారం. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకపోవడంతో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కాస్త చొరవ చూపారు. ఆర్‌అండ్‌బీ పనులు చేయకపోతే కనీసం జీవీఎంసీ పరిధిలో ఉన్న రహదారినైనా నిర్మించాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. పనులు ప్రారంభించే సమయానికి ఆర్ అండ్‌బీ అధికారులు అడ్డు చెప్పారు. మా పరిధిలో ఉన్న రహదారిని జీవీఎంసీ నిధులతో ఎలా చేయిస్తారని కొర్రీ వేశారు. కొద్దిరోజుల్లో తామే ప్రారంభిస్తామని ఎమ్మెల్యేకు ఆర్ అండ్‌బీ అధికారులు చెప్పారు. అలాచెప్పి నేటికి రెండునెలలు అవుతున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

8 నెలల్లో నలుగురు మృతి..

★ ఈ ఏడాది జనవరిలో సబ్బవరం మండలం గుల్లేపల్లికి చెందిన ఓ వివాహిత తన భర్తతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ చీమలాపల్లి వద్ద ఓ గొయ్యిని తప్పించబోయి కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

★ ఏప్రిల్ 16న కృష్ణానగర్‌కు చెందిన సూరిశెట్టి లక్ష్మి అనే వృద్ధురాలు తన భర్తతో ద్విచక్రవాహనంపై వస్తూ గుంతలో పడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

★ మే 20 బి.అమృత్ భరద్వాజ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ గుంతలను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయి మృతి చెందాడు.

★ ఆగస్టు 12న ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తూ చీమలాపల్లి వద్ద గుంతలను తప్పిస్తుండా ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో మొల్లేటి భీమాచారి మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎనిమిది నెలల గడువులో నలుగురు ప్రాణాలు కోల్పోయినా పాలకులు, అధికారులకు పట్టించుకోకపోవడంపై పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


చీమలాపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా గోతులు

వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా..

జీవీఎంసీ నిధులతో సగ భాగం రహదారిని అభివృద్ధి చేయించేలా గత జీవీఎంసీ కమిషనర్‌ను ఒప్పించా. కానీ నిబంధనల ప్రకారమే పనులు జరగాల్సి ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పడంతో నిలిచిపోయాయి. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పిన ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్సారం చేస్తున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటా.

– పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే, పెందుర్తి

చోరీల నియంత్రణపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల వద్ద విధిగా సి.సి.కెమెరాలను అమర్చాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. మంగళవారం పోలీసు సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, ఏ.టి.ఎం. సెక్యూరిటీ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఏ.టి.ఎం.ను చోరీ చేసిన తీరును వివరించి, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. నగరవ్యాప్తంగా ఉన్న 654 ఏ.టి.ఎం.ల్లో భద్రతా సమస్యలను తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే మొదటి గంట సమయంలోనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు మొత్తం తిరిగి వచ్చే అవకాశముందన్నారు. అందుకు బ్యాంకు అధికారుల సహకారం అవసరమన్నారు. డి.సి.పి. అజిత వేజెండ్ల, డి.సి.పి.(క్రైమ్) లతా మాధురి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగుల విధులు, బాధ్యతలు, అక్కడ అందిస్తున్న సేవలపై సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా అసకపల్లి సచివాలయానికి తీసుకెళ్లి ఉద్యోగుల పనితీరును ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి(జీసీడీవో) పద్మావతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్న్‌షిప్‌ను పర్యవేక్షిస్తున్న జీసీడీవో పద్మావతి

సంక్రాంతిలోగా ఉపాధి పనులు పూర్తి చేయాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న 'పల్లె పండగ.. (గ్రామ పంచాయతీ వారోత్సవాలు)' పురస్కరించుకుని మంగళవారం ఉపముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ వీసీలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీవోలు పాల్గొన్నారు. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేసిన పనులకు ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయా పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ఈ నెల 14 నుంచి 21 వరకు జరిగే వారోత్సవాల్లో కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఆయా పనులను వచ్చే ఏడాది సంక్రాంతిలోగా పూర్తి చేసి నిధులను సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పెందుర్తి ఇంఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, మూడు జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీవోలు

ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక కలయిక

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సబ్బవరం సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన జిలానీ బేగం మంగళవారం సుజాతనగర్‌లోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ఏమాత్రం అవినీతికి తావు లేకుండా ఉండాలని, మంచి పేరు తెచ్చుకోవాలని జిలానీ బేగంకు ఎమ్మెల్యే పంచకర్ల సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ అన్నారెడ్డి శంకర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిలానీ బేగం

నిర్వాసిత గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

పరవాడ, న్యూస్‌టుడే: ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల్లో వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సంస్థ అడ్మిన్ భవనంలో మంగళవారం నిర్వాసిత గ్రామాల సర్పంచులు, మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్‌లో భాగంగా విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏయే అవసరాలు ఉన్నాయి, ఎలాంటి పనులు చేయాలి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంస్థ అధికారులు ప్రశాంతకుమార్ జెనా, పద్మప్రియ, శ్రీమంత మహాపాత్ర, బి.బి.పాత్ర, ప్రకాశరావు, శివ ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


సర్పంచులు, అధికారులతో జీజీఎం సంజయ్‌కుమార్‌సిన్హా

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

పరవాడ, న్యూస్‌టుడే: రైతులంతా ఆధునాతన పద్ధతులు అవలంబించడంతో పాటు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి మంచి దిగుబడులు సాధించాలని పరవాడ మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి పేర్కొన్నారు. తానాంలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి కన్నూరు దేవి, ఏవో చంద్రావతి పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు. వరి పంటకు పొటాష్ లోపం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అశ్విని, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తానాంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో చంద్రావతి, సర్పంచి దేవి తదితరులు

వెలుగు ఏపీఎంగా రంగారావు


రంగారావు


ఫిరోజ్ బేగం


పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెలుగు ఏపీఎంగా బి.రంగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమిలి ఏపీఎంగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో సబ్బవరం, ముంచింగిపుట్టు, డుంబ్రిగుడలో పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన కనకమ్మ చీడికాడ మండలానికి బదిలీ అయ్యారు. మండల పరిషత్తు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ఫిరోజ్ బేగం బాధ్యతలు చేపట్టారు. ఈమె విశాఖ జిల్లా పరిషత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో అరకులో పనిచేశారు.

పశువులకు ఉచిత వైద్య శిబిరం

ముదపాక(పెందుర్తి), న్యూస్‌టుడే: పశు సంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెందుర్తి మండలం ముదపాక పంచాయతీ పరిధిలోని బొడ్డపువానిపాలెంలో పశువుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. పెందుర్తి మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావు, పశు గణాభివృద్ధి సంఘం వైద్యులు డాక్టర్ సౌజన్య పాల్గొని 56 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.


పాడి రైతులకు మందులు అందజేస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ ఎం.చంద్రశేఖర్

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఇరువాడ శివారు గణపతినగర్ చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి **మామిడి చందు** జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈయన తండ్రి కనకరాజు ఆటోడ్రైవర్, తల్లి త్రిమూర్తులు గృహిణి. జాతీయ పోటీల్లో రాణించాలని గ్రామస్థులు చందును మంగళవారం అభినందించారు.

జీవీఎంసీలో లీకుల పరంపర

జీవీఎంసీ జోన్-8 పరిధిలో తాగునీటి పైపులైన్ల లీకుల పరంపర కొనసాగుతూనే ఉంది. సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నా వృథాను మాత్రం అరికట్టలేకపోతున్నారు. దీంతో తాగునీరు యథేచ్ఛగా వృథా అవుతోంది. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి దొగ్గవానిపాలెంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో గత వారం రోజులుగా మంచినీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజు కుళాయిలు వచ్చే సమయంలో పైపులైను లీకేజీ వల్ల నీరంతా రోడ్డు పాలవుతోందని పేర్కొన్నారు. దీంతో శివారు ప్రాంతాలకు సక్రమంగా నీరందడం లేదని చిన్నరులా వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరారు.– న్యూస్‌టుడే, పెందుర్తి

దర్పణం



విశాఖ జట్టు ఘన విజయం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే క్రికెట్ టోర్నీలో భాగంగా కడప వైఎస్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో తూర్పుగోదావరితో జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 112/2తో బ్యాటింగ్ కొనసాగించిన విశాఖ జట్టు 68 ఓవర్లలో 426/3 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. విరాట్ (177*), రామ్‌చరణ్(133) సెంచరీలతో చెలరేగి జట్టుకు భారీ స్కోరును అందించారు. అనంతరం 167 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూ.గో. జట్టు 34 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయం చవిచూసింది. ప్రభ్యావర్ధన్ 5, వినోద్ 2 వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు.

న్యాయం చేయాలని భూసేకరణ రైతుల నిరసన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పెదముషిడివాడ జగనన్న లేఅవుట్‌కు చెందిన భూసేకరణ రైతులు నిరసన చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమ వద్దనున్న డి.పట్టా భూములను తీసుకుని పరిహారంగా లేఅవుట్‌లో అభివృద్ధి చేసిన స్థలాలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. పూర్తిస్థాయిలో స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అంబేడ్కర్ వెంటనే చేరుకుని రైతులతో మాట్లాడారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేడ్కర్


సుజాతనగర్‌లో మహాలక్ష్మి అలంకరణ


శ్రమశక్తినగర్‌లో మంగళగౌరిగా..


ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..


మహాలక్ష్మిగా సరిపల్లి దుర్గమాంబ


శారదాపీఠంలో..


రాజరాజేశ్వరిగా నాయుడు తోట గాయత్రిదేవి


బాలాజీగార్డెన్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారు


దుర్గానగర్‌లో లక్ష్మీదేవి అలంకరణ


కృష్ణానగర్‌లో..


మణిపురం భువనేశ్వరీమాత


క్షీరసాగర తనయకు.. భక్తజన నీరాజనం


సబ్బవరం దురాదేవి ఆలయంలో భరతనాట్యం చేసిన సింహనాథ్ బృందం

లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం.. శ్రీరంగ ధామేశ్వరీ.. అంటూ భక్తజనం మహాలక్ష్మి అమ్మవారిని మనసారా స్తుతించారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, ఉత్సవ మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జగన్మాత శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. అర్చకులు అఖిలాండేశ్వరికి విశేష పూజలు, కుంకుమార్చనలు, హోమాలు జరిపారు.
– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


పిట్టవానిపాలెంలో..


పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో..


సర్దార్ గౌతులచ్చన్న నగర్ కూడలిలో..


వెన్నెలపాలెంలో..


బొద్దపువానిపాలెంలో..


పెదనాయుడుపాలెంలో సారె సమర్పణ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలోని జాజులవానిపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలం తమ్మయ్యపేటకు చెందిన ముచ్చు చిన్నారావు, భార్య హేమలత, కుమారుడు సాకేత్ ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై గాజువాక వెళ్తుండగా అదే దారిలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

ఘనంగా స్వాగత వేడుకలు

వేపగుంట, న్యూస్‌టుడే: ఆర్ఆర్‌వెంకటాపురం దరి ఎస్‌వీఎల్ఎన్(ఆళ్వార్‌దాస్) కళాశాలలో మంగళవారం నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖ పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు హాజరై కళాశాల ప్రాంగణంలో గల ఆళ్వార్‌దాస్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు ఉల్లాసంగా గడుపుతూ నృత్య ప్రదర్శనలు చేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ ఆళ్వార్‌దాస్, సమన్వయకర్త జీవీఏఎస్ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

సబ్బవరం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని గ్రామాల్లో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు తెలిపారు. వార్డు పరిధిలోని నంగినారపాడు, గంగవరం, వెదుళ్లనరవ, దువ్వాడ ప్రాంతాల్లోని ధ్వంసమైన రోడ్లు, కాలువల పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వెదుళ్లనరవ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న కాలువను మంగళవారం పరిశీలించారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని గుత్తేదారుకు సూచించారు.


కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొల్లి ముత్యాలునాయుడు

నీటికి బదులు నాచు

పరవాడ, న్యూస్‌టుడే: ప్రస్తుత వర్షాకాలంలో నీటితో కళకళలాడాల్సిన చెరువులు పిచ్చిమొక్కలు, నాచుతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వేసవిలో సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఈ దుస్థితి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరవాడ శ్మశానవాటికను ఆనుకుని ఉన్న చెరువు వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. తూటికాడ, చెత్త, గుర్రపుడెక్కతో మురుగు కుంటను తలపిస్తోంది. కాలుష్య కాసారంగా మారి తీవ్ర దుర్వాసన రావడంతో స్థానికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ, పథకం, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో తటాకాలకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చెరువు, పరిసరాలను శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నాచు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న చెరువు

నిరంతర వెలుగులు.. పట్టని అధికారులు

సబ్బవరం, న్యూస్‌టుడే: రెండు నెలలుగా నిరంతరాయంగా విద్యుత్తు దీపాలు వెలుగుతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడు, అజనగిరి గ్రామాల్లో పగలు, రాత్రీ అనే తేడా లేకుండా చాలా దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. రెండు పల్లెల్లో కలిపి సుమారు నాలుగు వందలకు పైగా దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల దీపాల కాలపరిమితి కంటే ముందే మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని చెబుతున్న అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగటిపూట వెలుగులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.


రామాలయం ఎదుట పగలు వెలుగుతున్న హైమాస్ట్ దీపాలు


ఓ వీధిలో నిరంతరం వెలుగులు